సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



రాంనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరీంనగర్ గోకుల్‌నగర్ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నగరంలోని వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకల్లో యువతులు, చిన్నారులు



టవర్‌సర్కిల్ ప్రాంతంలో..



కరీంనగర్ రూరల్ మండలం నగునూరులో..



రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో..



కరీంనగర్ ప్రకాశంగంజ్‌లో..



గన్నేరువరం మండలకేంద్రంలో..



కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో..



జమ్మికుంట పట్టణంలో..

సద్దుల సంబురం

ఘనంగా పెద్ద బతుకమ్మ వేడుకలు

- ఉయ్యాల పాటలు.. కోలాట నృత్యాలు
- ఊరూవాడా ఆడిపాడిన ఆడపడుచులు
- అక్కడక్కడా ఇబ్బంది పెట్టిన వాన
- గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మ

రామరామరామ ఉయ్యాలో.. రామనేసిరామ ఉయ్యాలో.. ఇద్దరక్కచెల్లెండ్లు ఉయ్యాలో.. ఒక్క ఊరికిచ్చిరి ఉయ్యాలో.. చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ.. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ.. అంటూ తీరొక్క పాటలతో ఊరూవాడా మార్మోగింది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో పల్లె, పట్నంలో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. గురువారం జిల్లా వ్యాప్తంగా సద్దులను సంబురంగా జరుపుకోగా.. పొద్దుపోయేదాకా ఆడిపాడారు. పొద్దున్నే నిద్రలేచి.. పూలు కోసుకొచ్చి.. బతుకమ్మను పేర్చి సాయంకాలం నూతన వస్త్రాలు ధరించి, గౌరమ్మకు మొక్కి.. చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఆడబిడ్డలంతా లయబద్ధంగా అడుగులేస్తూ బతుకమ్మ పాటలు పాడారు. కోలాట నృత్యాలు.. దాండియా ఆటలతో సందడి చేశారు. మధ్యలో వర్షం ఆటంకం కలిగించినా.. కాసేపటికి తెరిపినిచ్చింది. పొద్దుపోయే వరకు ఆడిపాడి సమీప జలాశయాల్లో బతుకమ్మను నిమజ్జనం చేశారు. వెళ్లిరా.. బతుకమ్మ.. మళ్లీ రావమ్మా.. అంటూ సాగనంపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ప్రకాశంగంజ్ వద్ద వెండి బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. రాంనగర్, టవర్‌సర్కిల్, మంకమ్మతోట, చైతన్యపురి, గణేశ్‌నగర్, కమాన్, లక్ష్మీనగర్, హనుమాన్‌నగర్, కోతిరాంపూర్, భగత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– కరీంనగర్ కల్చరల్/సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



కరీంనగర్ మహాశక్తి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మతో కేంద్రమంత్రి సంజయ్ దంపతులు



బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న ఎమ్మెల్యే కమలాకర్, మేయర్ సునీల్‌రావు



రామడుగు: వెదిరలో బతుకమ్మ ఆడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



శక్తి ఆలయంలో బతుకమ్మలతో యువతులు



మానకొండూర్‌లో బతుకమ్మ నిమజ్జనం



సిటీలో వాయినం ఇచ్చుకుంటున్న మహిళలు



శ్రీవేంకటేశ్వర స్వామి రూపంలో బతుకమ్మ



గంజ్‌లో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలు



వర్షం కురుస్తుండగా రక్షణగా గొడుగు



దర్శించుకుంటున్న జిల్లా జడ్జి ప్రతిమ, కేంద్రమంత్రి బండి సంజయ్



అమ్మవారికి పసుపు కొమ్ముల అలంకరణ

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో గురువారం అమ్మవారు దుర్గాష్టమి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ అమ్మవార్లను దర్శించుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ న్యాయమూర్తి వెంట ఉన్నారు.

ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీలు

కరీంనగర్/హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్, జమ్మికుంట సబ్ ట్రెజరీ కార్యాలయాలను గురువారం కరీంనగర్ ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విధులలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బిల్లులను పెండింగ్ లేకుండా అందించాలని, అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. పింఛన్‌కు సంబంధించిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్ బిల్లులు, గ్రామ పంచాయతీ చెక్కులు, డీఏ, ఇతర బిల్లులను ఆలస్యం లేకుండా ఈ–కుబేర్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అవినీతి ఆరోపణలు వచ్చినట్లయితే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు. ఆఫీసు రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎస్‌టీవో హమిత్‌షా ఖాన్, ఎస్‌ఏ శశిధర్ పాల్గొన్నారు.

ప్రతీ గీత కార్మికుడికి సేఫ్టీకిట్

- ఉమ్మడి జిల్లాలో నాలుగు యంగ్ రెసిడెన్షియల్స్
- డంప్‌యార్డ్‌ను తరలించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతీ గీతకార్మికుడికి కాటమయ్య కిట్ (సేఫ్టీకిట్) అందజేస్తామని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం నగరంలోని ఎల్లమ్మ గుడి వద్ద సమావేశమందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గీతకార్మికులకు సేఫ్టీకిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలువురు గీతకార్మికులకు సేఫ్టీకిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. గీతకార్మికులు ప్రమాదాల బారినపడకుండా ఉండేందుకు సేఫ్టీకిట్లు దోహదం చేస్తాయన్నారు. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన ప్రతినిధులు సాంకేతికంగా ఆమోదం తెలిపిన తరువాత సేఫ్టీకిట్ తయారు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండు లక్షల మంది గీతకార్మికులు రిజిస్టర్ చేసుకున్నారని, వారందరికి దశలవారీగా సేఫ్టీకిట్లు అందజేస్తామన్నారు. భవిష్యత్‌లో తాటిచెట్టు నుంచి పడి చనిపోయారని మాట వినపడకూడదన్నారు. సేఫ్టీకిట్లపై గీతకార్మికులకు అవగాహన కల్పించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కల్పించాలన్నారు. డంప్‌యార్డ్‌ను ఇక్కడి నుంచి తరలించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పర్యాటక అభివృద్ధి కోసం మానేరు రివర్‌ఫ్రంట్ లాంటి నిర్మాణాలు చేపడుతున్నా, దిష్టిబొమ్మలా డంప్‌యార్డ్ ఉందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లకు శుక్రవారం శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్, మానకొండూరు, మంథని, ధర్మపురిల్లో ఈ రెసిడెన్షియల్స్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. రూ.180 కోట్లతో ఒక్కో భవన నిర్మాణం, మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో మహేశ్వర్, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి అనిల్ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే కొడూరి సత్యనారాయణగౌడ్, కార్పొరేటర్ ఐలెందర్‌యాదవ్, గౌడ సంఘం ప్రతినిధులు బూరుగు సత్యనారాయణగౌడ్, రాజన్నగౌడ్, మాచర్ల ప్రసాద్,పడిశెట్టి భూమయ్య, రాచకొండ తిరుపతిగౌడ్, బత్తిని సత్యం, పొన్నం సత్యం, కోట రవి, జాగిరి సాగర్ పాల్గొన్నారు.



కిట్లు అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

క్లుప్తంగా

రూ.2,22,222 విరాళం అందజేత



రామడుగు: రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో మూడు ఆలయాల పునర్నిర్మాణాల కోసం అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి రూ.2,22,222 విరాళం కమిటీ సభ్యులకు అందించారు. గోపాల్‌రావుపేట గ్రామాభివృద్ధిలో తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.5 లక్షల విలువైన నగలు, రూ.30వేల నగదు అపహరణ



జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని 15వ వార్డు శివాజీవాడలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. శివాజీవాడలో నివాసం ఉంటున్న కరీంనగర్‌కు చెందిన తోట ప్రసాద్ బుధవారం పండుగకు స్వస్థలానికి వెళ్లారు. గురువారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు ప్రసాద్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ప్రసాద్ వచ్చిచూసి ఇంట్లోని సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి నగలు, రూ.30 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించగా విచారణ చేపట్టారు. బాధితుడు సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేడు, రేపు గర్భగుడి దర్శనాలు రద్దు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో జరుగుతున్న దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11,12వ తేదీల్లో గర్భగుడి, అభిషేకాలు, అన్నపూజలు, ఆకులపూజలు, పల్లకీ సేవలు, కుంకుమపూజలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి గురువారం ప్రకటించారు. రాజన్న ఆలయంలో గురువారం నిర్వహించాల్సిన గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దు చేసినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ప్రకటించారు.

పాముకాటుతో రైతు మృతి

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక గ్రామానికి చెందిన రైతు చెన్నూరి ఆశయ్య (54) పాముకాటుకు గురై గురువారం మరణించినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. తన సోదరుడు లచ్చయ్య గడ్డివాము నుంచి ఈనెల 8న గడ్డి తీస్తున్న ఆశయ్యను అక్కడే పొంచిఉన్న విషపూరిత పాము కాటేసింది. కుడిచెయి మణికట్టు వద్ద గాయం కావడంతో కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అప్పు చేసి పరారై.. ఆత్మహత్యాయత్నం

కోరుట్ల: కోరుట్ల పట్టణానికి చెందిన ఓ వ్యాపారి స్థానికంగా అప్పు చేసి రెండురోజుల క్రితం పరారయ్యాడు. గురువారం కామారెడ్డిలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు సమాచారం. సదరు వ్యాపారి కోరుట్లలో పలువురి నుంచి సుమారు రూ.10 కోట్ల వరకు అప్పు తీసుకున్నట్లు తెలిసింది.

కొలువుల పండుగ

- టీచర్ ఉద్యోగమే లక్ష్యంగా.. • శ్రమించారు.. విజయం సాధించారు • ఒక్కొక్కరిది ఒక్కో గాథ • ఆనందం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

పుస్తకాలతో కుస్తీపట్టారు.. శ్రమించారు.. కొలువు సాధించారు.. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి కొందరు.. గురువుల ప్రోత్సాహంతో ఇంకొందరు.. అన్నదమ్ముల ఆదర్శంతో మరికొందరు .. పుట్టినిల్లు, మెట్టింటివారి సహకారంతో.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో గాథ.. పట్టుదలతో చదివి డీఎస్సీలో కొలువు సాధించారు. దసరా పండగకు రెండురోజుల ముందే సీఎం రేవంత్‌రెడ్డి, ఆయా జిల్లాల డీఈవోల చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు..వారివారి ఇళ్లలో ముందస్తుగానే పండుగ వాతావరణం నెలకొంది. ఈసందర్భంగా పలువురి విజయపథంపై కథనం..

గురువుల మార్గదర్శనంలో..



లావణ్య

శంకరపట్నం(మానకొండూర్): గురువుల మార్గదర్శనంలో టీచర్ కొలువు సాధించింది నేదురు లావణ్య. శంకరపట్నం మండలం అర్కండ్లకు చెందిన కొమురయ్య–ఆగమ్మకు పవన్, లావణ్య సంతానం. వీణవంక మండలం గంగారం జెడ్పీ స్కూల్‌లో ఎస్సెస్సీ చదివింది. బీఎస్సీ, బీఈడీ చేసి మొదటి ప్రయత్నంలో స్కూల్‌అసిస్టెంట్‌గా కొలువు కొట్టింది. అర్కండ్ల నుంచి ముగ్గురు బ్రాహ్మణులు టీచర్‌గా చేశారు. వెనకబడిన వర్గానికి చెందిన లావణ్య మొదటి మహిళా టీచర్ కావడం విశేషం.

22 ఏళ్లుగా ప్రైవేట్ స్కూల్లో..



భార్య, కూతురుతో రాంరెడ్డి

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం చింతలపల్లికి చెందిన పల్లె బుచ్చిరెడ్డి–దేవేంద్ర పెద్ద కుమారుడు రాంరెడ్డి 22 ఏళ్లుగా జమ్మికుంటలోని ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఎంఏ, ఎంఈడీ చేసిన అతడి వయస్సు 45 ఏళ్లు. అయినా చివరి ప్రయత్నంగా డీఎస్సీ రాసి ఎస్జీటీగా ఎంపిక అయ్యాడు.

తల్లిదండ్రుల కష్టం.. గురువుల ప్రోత్సాహం



తల్లిదండ్రులతో మునేశ్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తల్లిదండ్రుల కష్టం, గురువుల ప్రోత్సాహం, వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంవల్లే చదువుకుని టీచర్ కావాలన్న తనకల నెరవేర్చుకున్నానని పేర్కొన్నాడు మోడెం మునేశ్. కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలకు చెందిన మోడెం కొమురయ్య–తిరుమల కుమారుడు మునేశ్ డీఎస్సీలో సోషల్ స్టడీస్‌లో జిల్లాస్థాయి మూడో ర్యాంకు పొందాడు. బంధువులు వివాహం కోసం ఒత్తిడి తెచ్చినా టీచర్ కావాలనే తపనతో వాయిదా వేసుకున్నట్లు మునేశ్ చెప్పాడు.

ఆటో డ్రైవర్ కొడుకులిద్దరూ ఉద్యోగులే



కుటుంబ సభ్యులతో రాజేశ్

రాయికల్(జగిత్యాల): మండలంలోని బోర్నపల్లికి చెందిన జంగిలి రాజేశ్ తండ్రి గంగారాం ఆటో నడుపుతుండగా తల్లి లక్ష్మి వ్యవసాయం చేస్తోంది. అతడి తమ్ముడు సురేశ్ సింగరేణిలో సీనియర్ అసిస్టెంట్. రాజేశ్ ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తూ డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ) ఉద్యోగం సాధించాడు. కొడుకులిద్దరికీ ఉద్యోగాలు రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

16 ఏళ్ల నిరీక్షణ..



పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ హయాంలో నాటి సీఎం వైఎస్సార్ నిర్వహించిన డీఎస్సీలో తప్పిపోయా. 16 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఇప్పుడు టీచర్ కొలువు సాధించడం సంతోషంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చేతులమీదుగా నియామక పత్రం స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నా.

– గద్దం శ్రీనివాస్, లద్నాపూర్, పెద్దపల్లి

దుబాయ్‌లో పని చేస్తూ..



ఉద్యోగ పత్రం అందుకుంటున్న దేవదాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కసితో చదివి విజయం సాధించాడు తలె(జంగం) దేవదాసు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన దేవదాస్ కష్టపడి చదివి స్కూల్ అసిస్టెంట్(సోషల్)గా జిల్లాలో రెండో ర్యాంక్ సాధించాడు. 2012లో 1.0 జీరోలో ఉద్యోగం కోల్పోయిన అతడు అప్పటి నుంచి దుబాయిలో కష్టపడి పని చేస్తూ చదువును సాగించాడు. ఇంటికి వచ్చిన తర్వాత పట్టువదలని విక్రమార్కుడిలా చదివి ఉద్యోగం సాధించాడు. కాగా దేవదాస్ భార్య శారద గురుకులం టీచర్‌గా ఉద్యోగం సాధించగా, ప్రస్తుతం భర్తకు ఉద్యోగం రావడంతో ఆ కుటుంబంలో సంతోషానికి అవధుల్లేవు. నెల వ్యవధిలో ఇద్దరూ ఉద్యోగాలు సాధించి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు.

మెరిసిన అన్నాచెల్లెలు



సురేశ్, సుష్మిత

ముత్తారం(మంథని): ముత్తారం మండలం కేశనపల్లికి చెందిన కొల్ల కొమురయ్య, రాధ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె. పెద్ద కుమారుడు రమేశ్ ముంబయిలో బ్యాంకు ఆఫ్ బరోడాలో మేనేజర్. అన్నను ఆదర్శంగా తీసుకున్న సురేశ్ ఈ ఏడాది గురుకుల పాఠశాలలో సోషల్ టీజీటీ ఉద్యోగం సాధించాడు. డీఎస్సీలో సైతం కొలువు కొట్టాడు. పెళ్లియిన చెల్లెలు సుష్మిత ఇద్దరు అన్నల ఆదర్శంతో ఎస్జీటీ ఉద్యోగం సాధించింది. సురేశ్ స్పెషల్ టీచర్ కోట కింద స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం జగిత్యాల గురుకులంలో పనిచేస్తున్నాడు. డీఎస్సీలో జిల్లా మూడో ర్యాంకు వచ్చినా కొందరు కోర్టుకు వెళ్లడంతో ఉద్యోగం పెండింగ్‌లో ఉంది.

ఏడాదిలో మూడు ఉద్యోగాలు



సంతోష్

సైదాపూర్(హుస్నాబాద్): సైదాపూర్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన కొండపర్తి సంతోష్ ఏడాదిలో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాల, కాలేజీల్లోనే విద్యాభ్యాసం చేశాడు. తండ్రి రాజయ్యకు వ్యవసాయంలో తోడుగా ఉంటూ తెలుగు పీజీ, బీఈడీ చేశాడు. గతంలో గురుకుల టీజీటీ ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించి సైదాపూర్ బీసీ గురుకులంలో టీచర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల విడుదలైన డీఎస్సీ 2024 ఫలితాల్లో 78.53 మార్కులతో లాంగ్వేజ్ పండిట్ తెలుగులో జిల్లా ఫస్టు ర్యాంకు సాధించాడు. అలాగే 74.53 మార్కులతో స్కూల్ అసిస్టెంట్ తెలుగులో జిల్లా 5వ ర్యాంకు సాధించాడు. ఏడాదిలో మూడు ఉద్యోగాలకు ఎంపికవడంపై గ్రామస్తులు అభినందించారు.

వ్యవసాయ కూలీగా పని చేస్తూ..



తల్లిదండ్రులతో సంతోష్

రాయికల్ (జగిత్యాల): రాయికల్ మండలం కుమ్మరిపల్లికి చెందిన పెరుమల్ల సంతోష్ మొదటి ప్రయత్నంలోనే టీచర్ కొలువు సాధించాడు. తల్లిదండ్రులు సంజీవ్, సుశీల. వీరికి ఎకరం భూమి ఉండగా మరికొంత కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. అన్న రాజనర్సయ్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. సంతోష్ చదువుకుంటూ హమాలీ, వ్యవసాయ కూలీ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఆరునెలలు రోజూ 12 గంటల పాటు కష్టపడి చదివి సోషల్‌లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం రావడం మరిచిపోలేని అనుభూతి అని పేర్కొన్నాడు.

భార్య, తండ్రి సహకారంతో..



కుటుంబ సభ్యులతో కార్తీక్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిమ్మపల్లికి చెందిన మరియాల కార్తీక్ ఉన్నత కుటుంబంలో పుట్టినా పరిస్థితుల ప్రభావంతో పేదరికంలోకి నెట్టివేయబడి కష్టాలను అనుభవించాడు. తల్లి లలిత అనారోగ్యంతో మృతిచెందగా తండ్రి రాజబాబు బీడీ కంపెనీ టేకేదారుగా పనిచేస్తూ పోషించాడు. చిన్నప్పటి నుంచి టీచర్ వృత్తిపై మక్కువ పెంచుకున్న కార్తీక్‌కు వివాహం జరిగి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు అన్విక, అదితి ఉన్నారు. విద్యావలంటీర్‌గా పనిచేస్తూనే డిగ్రీ పూర్తి చేశాడు. దూరవిద్యలో ఎంఏ తెలుగు చేసి, మొదటిసారి డీఎస్సీ రాయగా ఎంపిక కాలేదు. బీడీ కంపెనీ చూసుకుంటూనే రెండో ప్రయత్నంలో జిల్లాలో రెండో ర్యాంకుతో టీచర్ ఉద్యోగం సాధించాడు. తన విజయానికి తండ్రి, భార్య సహకారం మరువలేనిదని కార్తీక్ పేర్కొన్నాడు.

పేదింట్లో ఉద్యోగ కుసుమం



తల్లి లక్ష్మితో ప్రవీణ్

కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన పులి సత్తయ్య– లక్ష్మి దంపతులది పేద కుటుంబం. పెద్ద కుమారుడు ప్రసాద్ గ్రామంలోనే పనులు చేసుకుంటున్నాడు. రెండో కుమారుడు ప్రవీణ్ పదో తరగతి వరకు కనగర్తి పాఠశాలలో చదివాడు. తండ్రి మృతి చెందడంతో పై చదువుల కోసం తల్లి కూలీ పనులకు వెళ్లి డబ్బులివ్వగా, సోదరుడు ప్రసాద్ అన్నివిధాల ఆదుకున్నాడు. కొంతకాలంగా హైదరాబాద్‌లోని బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే డీఎస్సీకి ప్రిపేర్ అయ్యాడు. ఇంగ్లిష్‌లో జిల్లాలో 11వ ర్యాంకు సాధించాడు. తనకు అన్నివిధాలా తోడ్పాటునందించిన తల్లి, సోదరుని సహకారం మరువలేనిదని ప్రవీణ్ పేర్కొన్నాడు.

పుట్టింటివారి కష్టం.. మెట్టింటి ప్రోత్సాహం



అక్క సమతతో చామంతి

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లెకు చెందిన కుమ్మరవేణి చామంతి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫిజికల్ డైరెక్టర్ ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైంది. తన అక్క సమత 2020లో పీఈటీగా ఎంపికైంది. వీరిద్దరూ జాతీయస్థాయిలో ఖోఖో ఆడి స్పోర్ట్స్ విభాగంలో కొలువులు సాధించారు. తమ తల్లిదండ్రులు, భర్త, అత్తామామల ప్రోత్సాహంతో ఉద్యోగాలు సాధించామని చామంతి, సమత తెలిపారు. వీరి చెల్లె సంయుక్త కూడా బీపీఈడీ చేసి డీఎస్సీ రాద్దామనే క్రమంలో పరీక్ష రోజే డెలివరీ కావడంతో రాయలేకపోయింది. తాను కూడా ఉద్యోగం సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది.

ఒకే ఇంట్లో ముగ్గురు మాస్టార్లు



అన్నావదినతో లావణ్య

ఓదెల(పెద్దపల్లి): కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సూత్రాల లకన్‌బాబు– వాణి దంపతులు, అతడి చెల్లె లావణ్య టీచర్ ఉద్యోగాలు సాధించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లావణ్య కరీంనగర్ జిల్లాస్థాయి 4వ ర్యాంకు సాధించి స్కూలు అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. అలాగే లకన్‌బాబు అతడి భార్య వాణి ఎస్జీటీలుగా ఉద్యోగం సాధించారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన వీరు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్న ఆదర్శం..



రవికుమార్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): అన్నను ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్‌లో జిల్లా మొదటి ర్యాంకు) ఉద్యోగం సాధించాడు ఇబ్రహీంపట్నం మండలం కొజన్‌కొత్తూర్‌కు చెందిన ఐతే రవికుమార్. అన్న మహేందర్ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి. తాను కూడా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని రవికుమార్ గత జూన్‌లో గురుకుల పరీక్ష రాసి టీజీటీ (ఇంగ్లిష్) ఉద్యోగం సాధించి జ్యోతిబాపూలే నిజామాబాద్ జిల్లా మొర్తాడ్‌లో పని చేస్తున్నాడు. సీఎం చేతుల మీదుగా నియామకపత్రం పొందడం ఆనందంగా ఉందని రవి పేర్కొన్నాడు.

భర్త ప్రోత్సాహంతో..



భర్తతో రజని

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): భార్యాభర్తలు ఇద్దరూ ప్రైవేట్ టీచర్లు. భర్త ప్రోత్సాహంతో డీఎస్సీలో జిల్లాలో 11వ ర్యాంకు సాధించింది సుల్తానాబాద్ మండలం తొగర్రాయికి చెందిన నేరెళ్ల రజని. 2009 నుంచి కస్తూరిబాగాంధీ విద్యాలయం, కాల్వశ్రీరాంపూర్ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్‌గా పని చేస్తూ ప్రిపేర్ అయింది. నాల్గోసారికి ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందని రజని పేర్కొంది.

ఆనందంగా ఉంది



గంభీరావుపేట(సిరిసిల్ల): మాది గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామం. తల్లిదండ్రులు కిరాణ దుకాణం నడిపిస్తూ కష్టపడి చదివించారు. వారి కష్టం, సోదరుడి ప్రోత్సాహంతో పట్టుదలతో చదివా. స్కూల్ అసిస్టెంట్ (గణితం) విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచా. ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. తల్లిదండ్రులకు రుణపడి ఉంటా. సోదరుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. ఆయనను ఆదర్శంగా తీసుకొని రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించా. నిన్నమొన్నటి వరకు గురుకుల పాఠశాలలో టీజీటీగా పనిచేశా.

– బాలకృష్ణ, గంభీరావుపేట

బీడీ ప్యాకర్ నుంచి..



బీడీ ప్యాకింగ్ చేస్తున్న రామచంద్రం

ధర్మపురి: బీడీ ప్యాకర్ టీచర్ కొలువు సాధించాడు. ధర్మపురి మండలం కొత్తకొండాపల్లెకు మెరుగు రామచంద్రం ఓకంపెనీలో రోజూ బీడీ ప్యాకింగ్ చేసి రాత్రి ధర్మపురిలోని శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర ఓరియంటల్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం హైదరాబాద్‌లో పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, బీఎడ్ పూర్తి చేశాడు. ఇటీవల డీఎస్సీలో తెలుగు పండిట్‌గా ఎంపికయ్యాడు. రామచంద్రం పట్టుదలతో ఉద్యోగం సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- రాజన్న సిరిసిల్ల జిల్లా స్తంభంపల్లిలో ఘటన



లచ్చిరెడ్డి (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): సద్దుల పండుగ రోజు విషాదం నెలకొంది. పంటచేలల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్న నలుగురు రైతులపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లూరి రవీందర్‌రెడ్డి, కందాడి లచ్చిరెడ్డి(61), నోముల రాజిరెడ్డి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉంటాయి. రవీంద్‌రెడ్డి ఇదే గ్రామానికి చెందిన సుభాష్‌తో కలిసి ఉదయం తన మిరపతోటలో మందు పిచికారీ చేస్తున్నాడు. కందాడి లచ్చిరెడ్డి తన కొడుకు నవీన్‌రెడ్డితో కలిసి పొలం పనులు చేసుకుంటున్నాడు. సమీపంలో ఉన్న దురిసెన చెట్టు కొమ్మ విరిగి మరో కొమ్మపై ఉన్న తేనెటెట్టుపై పడింది. దీంతో ఒక్కసారిగా తేనెటీగలు లేచాయి. చేలల్లో పనులు చేసుకుంటున్న అల్లూరి రవీందర్‌రెడ్డి, నోముల రాజిరెడ్డి, కందాడి లచ్చిరెడ్డిలపై దాడిచేశాయి. రవీందర్‌రెడ్డి పరుగుతీసి కరెంట్ పంపుసెట్ పరిసరాల్లో దాక్కున్నాడు. రాజిరెడ్డి చేలో ఓ సంచి కప్పుకుని తనకుతాను రక్షించుకున్నాడు. సరిగా నడవరాని కందాడి లచ్చిరెడ్డిపై తేనెటీగలు తీవ్రంగా దాడిచేశాయి. తన తండ్రిని రక్షించుకునే క్రమంలో నవీన్‌రెడ్డి సైతం గాయపడ్డాడు. సమీపంలో ఉన్న సుభాష్, బొంగాని శ్రీనివాస్, పర్శరాములు నిప్పురాజేసి, తేనెటీగలను దారిమళ్లించారు. తీవ్రంగా గాయపడిన కందాడి లచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డిని వేములవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లచ్చిరెడ్డి మృతిచెందాడని వైద్యులు తెలిపారు. స్వల్పంగా గాయపడిన రాజిరెడ్డి ఇంటివద్ద చికిత్స పొందుతున్నారు. ఎస్సై పృథ్వీరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డు మృతి



సుబ్బరాజు (ఫైల్)

మెట్‌పల్లి: ఆర్టీసీ బస్ డ్రైవర్ నిర్లక్ష్యం.. అతివేగం ఓ హోంగార్డును బలి తీసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న హోంగార్డును బస్సు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం .. పట్టణానికి చెందిన ఓంకారం వెంకటసుబ్బరాజు (43) హోంగార్డుగా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం తన ద్విచక్రవాహనంపై పట్టణ శివారులో ఉన్న టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడ అల్పాహారం తీసుకొని తిరిగి వెళ్తుండగా.. అదే సమయంలో నిజామాబాద్ నుంచి వస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలైన సుబ్బరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. బస్ డ్రైవర్ బడావత్ సుమన్ బస్సును పక్కకు నిలిపి పారిపోయాడు. సమాచారమందుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆర్ఎస్సై సుమన్‌తో కలిసి సుబ్బరాజు అంత్యక్రియలకు ఆయన కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. ఆర్టీసీ డీఎం దేవరాజ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో పండుగ పూట విషాదం నెలకొంది.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ మార్కెట్లో సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న నాగపూర్‌కు చెందిన హేమరాజ్ చౌరే అనే నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. హేమరాజ్ చౌరే, తన ముగ్గురు స్నేహితులతో నాగపూర్ నుంచి కరీంనగర్ వచ్చి మార్కెట్లో కూరగాయలు కొంటున్న పలువురి వద్ద ఏడు సెల్‌ఫోన్లు దొంగిలించాడు. బాధితుడు లింగంపల్లి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, హేమరాజ్ చౌరేను అరెస్టు చేశారు. అతని నుంచి ఏడు సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. ఒక కారు సీజ్ చేశారు. మిగతా వారిని గురించి గాలిస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



సాయిరాం మృతదేహం

కోరుట్ల రూరల్: మండలం కిషన్‌రావుపల్లె గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోరుట్ల పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కడకుంట్ల సాయిరాం (27) మృతిచెందాడు. పట్టణంలోని ఝాన్సీరోడ్ ఏరియాలో నివాసముండే కడకుంట్ల సుభాష్–భారతీ దంపతుల కుమారుడు సాయిరాం ముంబయ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండగ కోసం మూడు రోజుల క్రితం కోరుట్లకు వచ్చాడు. గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై తన స్నేహితులతో కలిసి ఐలాపూర్ వెళ్లాడు. రాత్రి కోరుట్లకు తిరిగి వస్తుండగా కిషన్‌రావుపల్లె శివారులో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు 108 ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే సాయిరాం మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంత్‌సేవాలాల్ మహరాజ్ ప్రతిష్ఠ



ధర్మనాయక్‌తండాలో సేవాలాల్, భవాని అమ్మవార్ల ప్రతిష్ఠాపన వేడుకలు

సారంగాపూర్: సారంగాపూర్ మండలం ధర్మనాయక్‌తండాలో గురువారం సంత్‌సేవాలాల్ మహరాజ్, మేరమయాడి (దుర్గాదేవి) అమ్మవార్ల ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. తండా బంజారా యువజన సంఘం ఆధ్వర్యంలో ఆలయాన్ని ఇటీవల నిర్మించారు. గురు, శుక్రవారాల్లో స్వామివారు, అమ్మవారి ప్రతిష్ఠాపనోత్సవాలు ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా పురియాఘాట్ బంజారా పూజారులు రానున్నట్లు పేర్కొన్నారు.

పక్కాగా ఉపాధి ప్రణాళిక

- ప్రజాభిప్రాయానికే ప్రాధాన్యత
- పనుల గుర్తింపునకు సాగుతున్న కసరత్తు
- మండలాల వారీగా ప్రణాళికలు



ఉపాధి పనిలో కూలీలు

కరీంనగర్ అర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు ప్రజల చేతికి చేరింది. ఏ ఏ పనులు చేపట్టాలి, ఏ కాలంలో వేటిని నిర్వహించాలనేది ఇక ప్రజల ఇష్టమే. ఉపాధి హామీలో పనిచేసే కూలీలతో పాటు వివిధ వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు కసరత్తు మొదలైంది. కూలీలకు ఉపాధి కల్పనతో పాటు గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించే స్వేచ్ఛను పంచాయతీలకే అప్పగించారు. ఆమోదయోగ్యమైన పనుల గుర్తింపునకు అధికారులు, ప్రజాప్రతినిధులు కసరత్తు చేస్తున్నారు. గ్రామ సభల ద్వారా తీర్మానం చేసిన పనులకు ప్రాధాన్యం ఉండనుండగా మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించిన అనంతరం జిల్లా ప్రణాళికను తయారు చేయనున్నారు. గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ పనుల గుర్తింపు చర్యలు చేపడుతున్నారు. నవంబరు 30 వరకు ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

కార్మిక బడ్జెట్ ఆధారంగానే..

గ్రామాల్లో ప్రాధాన్యం కలిగిన పనులను గుర్తించి గ్రామసభల ద్వారా ప్రజల ఆమోదం పొందనున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తించిన పనులకు కార్మిక బడ్జెట్ రూపొందించి కేంద్రానికి నివేదిస్తారు. బడ్జెట్‌కు కేంద్రం ఆమోదం తెలిపితే... దాని ఆధారంగా వచ్చే ఏప్రిల్ నుంచి వార్షిక ప్రణాళిక ద్వారా ఉపాధి హామీ పనులు చేపట్టనున్నారు. 313 పంచాయతీల్లో ఈనెలాఖరులోగా గ్రామసభలు పూర్తిచేసి, నవంబర్లో మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించనున్నారు. పథకంలో మొత్తం 266 రకాల పనులు చేపట్టవచ్చు. జిల్లాలో ప్రధానంగా పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని కలెక్టర్ నిర్ణయించారు. అంగన్వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, మరుగుదొడ్లు, అనుసంధాన రహదారులు, ఇంకుడుగుంతలు, చెక్ డ్యాంల నిర్మాణంతో పాటు పంట కాల్వల్లో పూడికలు తీయటం, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడిపరిశ్రమ, కోళ్లు, మేకల పెంపకానికి కావాల్సిన షెడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వనున్నారు. జిల్లాలో 2023–24లో 3.08 లక్షల మంది పనులు చేయగా 4,253 కుటుంబాలు 100 రోజులు పూర్తిచేసుకున్నాయి. 2024–25 లో ఈనెల 8వరకే 500 కుటుంబాలకు 100 రోజుల పని కల్పించారు. గ్రామ సభల తీర్మాణం మేరకు పనులను గుర్తిస్తామని, కూలీలకు చేతినండా పని దొరికేలా ప్రణాళికలు రచిస్తున్నామని అధికారులు వివరించారు

జిల్లాలో పనుల వివరాలిలా

ప్రస్తుతం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్ని గ్రామాల్లో ఉపాధి ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పథకం కింద గ్రామాల్లో ఏయే పనులు చేపట్టాలో, గ్రామ అవసరాలకు ఉపయోగపడే పనులను గుర్తించి గ్రామసభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 16 మండలాల్లో 1,51,654 జాబ్ కార్డులుండగా 2,95,543 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇందులో 1,03,901 జాబ్‌కార్డుల్లోని కూలీలు పనులకు వస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు చేరుకుని ఉపాధి పనులకు వస్తుండటంతో కొత్తగా 13212 జాబ్‌కార్డులను అధికారులు మంజూరు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 90,454 కుటుంబాల్లోని 12,112 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవగా 31,90,032 పనిదినాలు కల్పించారు. 12012 పనులను చేపట్టి 6వేలకు పైగా పనులను పూర్తి చేశారు. మిగతా పనులు కొనసాగుతుండగా కూలీలకు వేతన రూపంలో రూ.81.01కోట్లు అందించారు. ఈ సారి పెరిగిన కూలీల పని డిమాండ్‌కు అనుగుణంగా పనిదినాలను కల్పించేలా పనుల ప్రణాళికను తయారు చేయనున్నారు.

● టెక్...టాక్



రెడ్ మ్యాజిక్ టైటాన్ 16 ప్రో

రిజల్యూషన్: 2,560×1,600 పిక్సెల్స్
బరువు: 2.4 కేజీ;
రిఫ్రెష్‌రేట్: 240 హెచ్‌జడ్
వోఎస్: విండోస్ 11 హోమ్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్10 ప్లస్



డిస్‌ప్లే: 12.4 అంగుళాలు
మోమరీ: 12జీబి ర్యామ్/256జీబి/512 జీబి స్టోరేజ్
కెమెరా: 13 ఎంపీ మెయిన్/ 8 ఎంపీ ఆల్ట్రా వైడ్/ 12 ఎంపీ ఫ్రంట్
బ్యాటరీ: 10,900 ఎంఏహెచ్



ల్యాప్‌టాప్ మౌంట్ మ్యాగ్-సేఫ్ ఫోన్

బ్రాండ్: ఇన్ఎవిటే
కలర్: బ్లాక్; స్పెషల్ ఫీచర్స్: ఆర్మ్
మౌంటింగ్ టైప్: టేబుల్ మౌంట్
బరువు: 100 గ్రా.
ప్రాడక్ట్ డైమెన్షన్స్: 13×5.6×0.5 సీఎం

మొబైల్ అండ్ ట్యాబ్‌లెట్ హోల్డర్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
కలర్: బ్లాక్
ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
360 డిగ్రీ రొటేషన్ ఫీచర్
కంపాటబుల్ ఫోన్ మోడల్స్: ఆల్ ఫోన్స్

ఇంగ్లీష్ ఇడియమ్స్



ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్

గొడవలు లేదా విభేదాలకు స్వస్తి పలకడానికి సుముఖతకు వ్యక్తం చేయడానికి, స్నేహపూర్వక హస్తాన్ని అందించి సామరస్యం దిశగా అడుగులు వేసేటప్పుడు వాడే మాట...ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్.

ఉదా: డూరింగ్ నెగోషియన్స్, ఈచ్ సైడ్ టూక్ టర్న్స్ ఎక్స్‌టెండింగ్ ది ఆలివ్ బ్రాంచ్ టు ట్రై అండ్ రీచ్ ఏ కాంప్రమైజ్.

వానిష్ ఇన్ టు ది ఏయిర్

'ఒక్కసారిగా మాయమయ్యాడు' 'ఫైల్స్ ఉన్నట్టుండి మాయం అయ్యాయి'... ఇలా చెప్పే సందర్భంలో వాడే మాట... వానిష్ ఇన్ టు ది ఏయిర్.

ఉదా: మై కీస్ సీమ్ టు హ్యావ్ వానిష్‌డ్ ఇన్‌టు తిన్ ఏయిర్. ఐ హ్యావ్ సెర్చ్‌డ్ ఎవ్రీవేర్ అండ్ కాంట్ ఫైండ్ దెమ్.

ఇన్‌స్పిరేషన్



రుక్మిణి వారియర్

ఆరో తరగతి ఫెయిలైన అమ్మాయికి 'ఐఏఎస్' కలలు ఉంటాయా?
'సాధ్యం కాదు' అనుకున్నదాన్ని 'సాధ్యం' చేయవచ్చా?
ఈ రెండు ప్రశ్నలకు జవాబు చెప్పే పేరు....రుక్మిణి రియర్.
ఆరో తరగతి ఫెయిలైన రుక్మిణి తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో రెండో ర్యాంకు సాధించింది. ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కమిషనర్‌గా 'ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి' అనుకునేలా పనిచేస్తోంది...

స్కూల్ రోజుల్లో రుక్మిణి బ్రైట్ స్టూడెంట్ కాదు. రుక్మిణి ఆరో తరగతి ఫెయిల్ కావడం ఎవరికీ పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే ఆ ఫెయిల్యూరే తనను సక్సెస్‌కు దగ్గర చేసింది.

'ఫెయిల్యూర్ అంటే మొదలైన భయం ఎలాగైనా సక్సెస్ కావాలనే పట్టుదలను పెంచింది' అంటుంది రుక్మిణి. అమృత్‌సర్‌లోని 'గురునానక్ యూనివర్సిటీ'లో సోషల్ సైన్స్‌లో డిగ్రీ చేసిన రుక్మిణి ముంబైలోని 'టాటా ఇనిస్టిట్యూట్'లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఆ తరువాత ముంబై, మైసూర్‌లలో కొన్ని స్వచ్ఛందసంస్థలలో పనిచేసింది.

స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తున్న క్రమంలో అంకితభావం, వృత్తినిబద్ధత ఉన్న ఎంతో మంది ఐఏఎస్ అధికారుల గురించి విన్నది. వారి గురించి విన్నప్పుడల్లా 'ఐఏఎస్' వైపు మనసు మళ్లేది. చివరికది అది తన కలగా మారింది. 'ఒక ప్రయత్నం చేసి చూద్దాం' అని రంగంలోకి దిగింది. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండానే తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో ఆల్ ఇండియా ర్యాంక్ 2 సాధించింది. 'ఆరోతరగతి ఫెయిలైన అమ్మాయి ఐఏఎస్ సాధించింది'... రుక్మిణి గురించి ఇలాంటి వార్తలు వైరల్ అయ్యాయి. చాలామంది విద్యార్థులు ఆమెను కలుసుకొని మాట్లాడి సలహాలు తీసుకునేవారు.

కట్ చేస్తే...

ఇప్పుడు రుక్మిణి రియర్ రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ కమిషనర్.

యూపీఎస్సీలో సెకండ్ ర్యాంక్‌తో ఎలా వార్తల్లో నిలిచిందో మున్సిపల్ కమిషనర్‌గా కూడా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. దీనికి కారణం అక్రమార్కుల పాలిట ఆమె సింహస్వప్నం కావడమే. డిసెంబర్‌లో జరగబోయే 'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'ను దృష్టిలో పెట్టుకొని విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. విమానాశ్రయం నుండి 22 గోదాముల వరకు ప్రధాన రోడ్లను పరిశీలిస్తూ వెళ్లింది.

నగర పరిశుభ్రత, సుందరీకరణ గురించి స్థానికులతో మాట్లాడింది. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఫ్లైఓవర్‌లు మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి పెయింటింగ్, లైటింగ్‌ల కోసం సూచనలు ఇచ్చింది.

గోడలకు పెయింటింగ్ వేయడం నుంచి పబ్లిక్ టాయిలెట్లు, చెత్త కుండీలు శుభ్రం చేయడం వరకు ప్రతి పని దగ్గర ఉండి చేయిస్తుంది. నగర సుందరీకరణతో పాటు ఆక్రమణలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' ద్వారా జైపూర్‌ను గ్లోబల్ సిటీగా ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. దీని కోసం జైపూర్ అద్భుతంగా కనిపించకపోయినా... పరిశుభ్రంగా, ఆక్రమణలు లేకుండా కనిపించాలి. ఇది అనుకున్నంత సులువైన పనేమీ కాదు. ఎందుకంటే సమ్మిట్‌కు ఎన్నో నెలలు లేదు. అయినా సరే వెనక్కి తగ్గకుండా కష్టపడుతూ ప్రజల నుంచి శభాష్ అనిపించుకుంటోంది రుక్మిణి.

'పని చెయ్యకపోయినా ఫరవా లేదు. చేస్తే మాత్రం శ్రద్ధగా, భక్తిగా చేయాలి' అని అమ్మ అంటుండేది. ఆ మాటలే రుక్మిణి రియర్‌కు వేదవాక్కు.

ఏఐ ఏరియా



మెటా వారి మూవీ జెన్


'మూవీ జెన్' అనే కొత్త ఏఐ మోడల్‌ను రూపొందిస్తున్నట్లు టెక్ దిగ్గజం 'మెటా' ప్రకటించింది. ఇది ప్రాంప్ట్‌లకు స్పందనగా రియలిస్టిక్ వీడియో, ఆడియో క్లిప్‌లను జనరేట్ చేయగలదు. ఓపెన్ ఏఐ, ఎలెవన్ ల్యాబ్స్‌లాంటి ఏఐ వీడియో టూల్స్‌కు ఇది గట్టి పోటీ ఇవ్వగలదని పరిశీలకులు భావిస్తున్నారు. ఓపెన్ ఏఐ తన వీడియో మోడల్ 'సోరా'ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఓపెన్ ఏఐ షేర్ చేసిన డెమోలు ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించాయి.

'సోరా' ఇంకా అందుబాటులోకి రానప్పటికీ దాని హైపర్ రియలిస్టిక్ ఫుటేజ్ హాలీవుడ్ స్థాయిలో కనిపించింది. ఈ నేపథ్యంలో 'మూవీ జెన్' గురించిన సమాచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది టెక్స్ట్ ఇన్‌పుట్స్ సహాయంతో వీడియోలను జనరేట్ చేస్తుంది. ఫుటేజ్, స్టిల్ ఇమేజ్‌లను ఎడిట్ చేయగలదు. వీడియోకు జోడించే ఆడియో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జనరేట్ చేయబడుతుందని, విజువల్‌కు సింక్ అవుతుందని సమాచారం. వివిధ యాస్పెక్ట్ రేషియోలలో వీడియోలను రూపొందించడంతో పాటు వీడియోలకు నిర్దిష్ట సవరణలు చేయగలదు. యూజర్ అందించిన చిత్రాలను ఉపయోగించి పర్సనలైజ్ కంటెంట్‌ను సృష్టించగలదు. టెక్నికల్‌గా చూస్తే...'మూవీ జెన్' అనేది వీడియో జనరేషన్ కోసం 30 బిలియన్ పారామీటర్ మోడల్, ఆడియో కోసం 13 బిలియన్ పారామీటర్ మోడల్‌ను ఉపయోగిస్తుంది.

మెటా మాటల్లో చెప్పాలంటే 'మూవీ జెన్' అనేది అధునాతన ఏఐ వీడియో సృష్టి సాధనం.

● గేమింగ్

మన దేశంలోని ప్రముఖ గేమింగ్ స్టూడియోలలో ఒకటైన 'అఫ్రెమింగ్' తన బ్యాటిల్ రాయల్ గేమ్ 'ఇండస్' లాంచ్ తేదీని ప్రకటించింది. ఈ నెల16 నుంచి గేమ్ సందడి మొదలు కానుంది. ఈ గేమ్ గూగుల్ ప్లేస్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ గేమ్‌లోని హీరో లక్ష్యం 'కాస్మియం' అని పిలవబడే అరుదైన వనరును సేకరించడం, తన ప్రత్యర్థి ప్రోక్రాన్‌ను ఎదుర్కోవడం.



ఆయుధాల దండోర

'డోన్ట్ వేస్ట్ టైమ్...ఫినిష్ హిమ్' అంటూ వచ్చిన గేమ్ ట్రైలర్ ఆకట్టుకుంది. 'ఇండస్ ద్వారా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయలలోని ప్రత్యేకమైన పాత్రలు, ఆయుధాలను ప్లేయర్స్ ముందుకు తీసుకువస్తున్నాం. బీటా దశలో ప్లేయర్స్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో గేమ్‌ను మరింత మెరుగు పరిచాం' అంటున్నాడు 'సూపర్‌గేమింగ్' సీయివో రోబీజాన్.

ప్లాట్‌ఫామ్స్: పీసి, మొబైల్, కన్సోల్; **జానర్:** బ్యాటిల్ రాయల్ గేమ్

మ్యూజిక్ వరల్డ్

ధీ ధీ తారా



'సౌత్ ఇండియన్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఆసక్తి. పాటలు వింటాను. మ్యూజిక్ వీడియోలు చూస్తుంటాను' అంటున్న కొరియన్ ఆర్టిస్ట్ ఔర సింగర్-సాంగ్ రైటర్ శిరీష భాగవతులతో కలిసి 'ధీ ధీ తారా' (కుట్టనాడన్ డ్రీమ్స్) ఆలపించాడు. గత సంవత్సరం చివరిలో బిగ్‌బాస్ సీజన్ 17లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా కనిపించాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఝలక్ దిఖ్లా సీజన్ 11లో కూడా కనిపించాడు. ఈ క్రమంలో ఇండియన్ మ్యూజిక్‌పై లవ్ పెంచుకున్నాడు.'ఛలో' 'రోకో'లాంటి పదాలు పలుకుతున్న ఔర హిందీ నేర్చుకోవాలనుకుంటున్నాడు.

'ఔరా ఉచ్చారణ చాలా భిన్నంగా ఉంటుంది. దీని కోసం ఐదు వారల పాటు పనిచేశాడు. అతడి అంకితభావం నాకు ఎంతగానో నచ్చింది' అంటున్న శిరీష ఔరాను మన దేశంలోని ఇంటిపేరుగా అభివర్ణించింది. 'మార్నింగ్ నూన్ ఈవెనింగ్' 'బ్లూ ఓషియన్' 'ఫైర్‌వర్క్'....ఇలాంటి ఎన్నో సింగిల్స్‌తో పేరు తెచ్చుకున్న ఔరా 2014లో బాయ్ బ్యాండ్ ఎఎతో కెరీర్ ప్రారంభించాడు.

సినిమా

నాలుగు దశాబ్దాలు వెనక్కి...


● రాజ్ తరుణ్, సందీప్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ చిత్రం 'రామ్ భజరంగ్'. సిమ్రత్ కౌర్, సత్నా టైటస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయ్యింది. దసరా నవరాత్రుల సందర్భంగా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో రాజ్ తరుణ్, సందీప్ డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు. ఎందుకంటే దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సాగే కథలో ఇద్దరూ నటిస్తున్నారు. ''1980 నేపథ్యంలో సాగే ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఛాయా దేవి, మనసా రాధాకృష్ణన్, రాజా రవీంద్ర, రవిశంకర్, షఫీ, శివరామరాజు వెంకట్, 'సత్యం' రాజేశ్, ధనరాజ్, 'రచ్చ' రవి, ఐశ్వర్య ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: అజయ్ విన్సెంట్.


● అజిత్

సంక్రాంతి బరిలోనే...

అజిత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లోని మ్యాడ్రిడ్‌లో జరుగుతోంది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్, సాంగ్ చిత్రీకరణలను కూడా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో సునీల్, ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారని, హీరోయిన్ శ్రీలీల మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికి విడుదల కానుంది. అయితే ఈ సినిమాకన్నా ముందే అజిత్ హీరోగా కమిటైన 'విడాముయర్చి' చిత్రం సంక్రాంతికి విడుదలతుందని, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వచ్చే వేసవిలో రిలీజ్ కానుందనే ప్రచారం తెరపైకి వచ్చింది. కానీ తాజాగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికే రిలీజ్ అవుతుందని వెల్లడించి, అజిత్ కొత్త లుక్‌ను యూనిట్ రిలీజ్ చేసింది. దీంతో 'విడాముయర్చి' చిత్రం వచ్చే వేసవిలో రిలీజ్ అవుతుందని ఊహించవచ్చు.

పవర్‌ఫుల్ ఝాన్సీ


● లక్ష్మీ రాయ్

లక్ష్మీ రాయ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురు ప్రసాద్ దర్శకత్వం వహించారు. తమిళ, కన్నడ భాషల్లో ఆల్రెడీ విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకాదరణ దక్కిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమా తెలుగు హక్కులను ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ''ప్రేమ, యాక్షన్ అంశాలతో రూపొందిన సినిమా ఇది. మూడు వేరియేషన్స్ ఉన్న పాత్రలో లక్ష్మీ రాయ్ అద్భుతంగా నటించారు. డ్రగ్స్ సప్లై చేస్తూ కాలేజీ అమ్మాయిల జీవితాలతో ఆడుకునే ఓ ముఠా ఆటను అడ్డుకునే పవర్‌ఫుల్ ఝాన్సీ పాత్రలో లక్ష్మీ రాయ్ నటించారు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేసి, సినిమాను నవంబరులో రిలీజ్ చేస్తాం'' అని ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు.

మహాకాళి

ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో


● మహాకాళి పోస్టర్

దర్శక-నిర్మాత-కథారచయిత ప్రశాంత్ వర్మ నేతృత్వంలోని 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రానున్న కొత్త చిత్రానికి 'మహాకాళి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్‌ప్లేతో దర్శకురాలు పూజా అపర్ణ కొల్లూరు ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం 'మహాకాళి' సినిమాను ప్రకటించి, ఈ సినిమా పోస్టర్, గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''భారతదేశం నుంచి వస్తున్న ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో ఫిల్మ్ 'మహాకాళి'. మా యూనివర్స్‌లో మోస్ట్ ఫిరోషియస్ సూపర్ హీరో మూవీ. బెంగాల్ నేపథ్యంలో అక్కడి సంస్కృతి, సంప్రదాయాలతో ఈ సినిమా ఉంటుంది. భారతీయ మహిళల వైవిధ్యాన్ని, వారి అచంచలమైన స్ఫూర్తిని సెలబ్రేట్ చేసుకునేలా ఈ చిత్రం ఉంటుంది. సాధికారత, విశ్వాసం, అద్భుతమైన ప్రయాణం వంటి అంశాలను ప్రతిబింబిస్తుంది. కాళీ దేవి ఉగ్రరూపం, దయగల స్వభావం ఈ సినిమాలో కనిపిస్తాయి. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణులను త్వరలో వెల్లడిస్తాం. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేస్తాం. ఐమాక్స్ 3డీ వెర్షన్ రిలీజ్ కూడా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: స్మరణ్ సాయి.

కామెడీ డ్రామా షురూ


● రానా, టీనా శ్రావ్య, తిరువీర్

తిరువీర్ హీరోగా నటించనున్న కొత్త చిత్రానికి 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో టీనా శ్రావ్య హీరోయిన్‌గా నటించనున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో సందీప్ అగరం, అష్మితా రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సందీప్ అగరం కెమెరా స్విచ్చాన్ చేయగా హీరో-నిర్మాత రానా దగ్గుబాటి క్లాప్ ఇచ్చారు. రాహుల్ శ్రీనివాస్ గౌరవ దర్శకత్వం వహించారు. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ- ''కామెడీ డ్రామాగా ఈ సినిమా ఉంటుంది. నవంబరు 7న వైజాగ్, ఎస్. కోట లొకేషన్స్‌లో ఈ మూవీ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ''ఓ కొత్త పాయింట్‌తో రాహుల్ ఈ సినిమా కథను చెప్పనున్నారు'' అని పేర్కొన్నారు నిర్మాతలు సందీప్ - అష్మిత. రోహన్ రాయ్, నరేంద్ర ఇతర కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్.

పాంచ్ పటాకా


● మహేశ్ రెడ్డి, రామ్ నందా

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్ అనే నూతన నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. ఎంట్రీ ఇవ్వడమే పాంచ్ పటాకాలా ఐదు సినిమాలు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్ లోగో, మోషన్ పోస్టర్‌ను ప్రముఖ వ్యాపారవేత్త మహేశ్ రెడ్డి లాంచ్ చేశారు. హిమ నందా గజా సమర్పణలో రామ్ నందా దర్శక, నిర్మాతగా హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్‌లో వరుసగా ఐదు చిత్రాలు రానున్నాయి. ఈ ప్రొడక్షన్ లాంచ్ కార్యక్రమంలో రామ్ నందా మాట్లాడుతూ- ''రియల్ ఎస్టేట్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చాను. 2002 నుంచి సినిమా రంగంలో ఉన్నాను. నా కుటుంబం మొత్తాన్ని సూచించేలా హెచ్ఎస్ క్యూబ్ లోగోని నేనే రూపొందించాను. ప్రస్తుతం మా ప్రొడక్షన్ నుంచి ఐదు చిత్రాలు (ప్రేమలు- పెళ్లిళ్లు, మనసు, ఎల్ఎస్ఎల్ఎమ్, గతి, రామున్ని నేనే- రావణున్ని నేనే) రానున్నాయి. అన్ని చిత్రాల కథలు సిద్ధంగా ఉన్నాయి. ఐదు సినిమాలు ఒకేసారి చేసేంత డబ్బు లేదు. ఒక సినిమా తర్వాత ఇంకోటి చేస్తాను. 'ప్రేమలు-పెళ్లిళ్లు'ని ముందుగా సెట్స్ మీదకు తీసుకొస్తాను. ఇందులో కొత్తవారు నటిస్తారు'' అన్నారు.

ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్


● నేహా, రాహుల్

'రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్'. అశోక్ రెడ్డి కడదూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'డియర్ మేఘ, 'భాగ్ సాలే' వంటి వైవిధ్యమైన సినిమాలు నిర్మించిన వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్‌పై అర్జున్ దాస్యన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో-నిర్మాత రానా దగ్గుబాటి విడుదల చేసి, 'టైటిల్ ఆసక్తిగా ఉంది... సినిమా సక్సెస్ అవ్వాలి'' అని ఆకాంక్షించారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా అశోక్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. నూతన దర్శకుడైనా అనుభవం ఉన్నవాడిలా తీర్చిదిద్దుతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. అజయ్ ఘోష్, మురళీధర్ గౌడ్, గెటప్ శ్రీను, రచ్చ రవి, రవి వర్మ, గంగవ్వ, జయశ్రీ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: కార్తీక్ కొప్పెర, సంగీతం: సురేష్ బొబ్బిలి.

ఓటీటీ ఇది చూడొచ్చు

బిడ్డ కోసం పోరాడిన ఓ కన్నతల్లి కథ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'కిడ్నాప్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.


● 'కిడ్నాప్' పోస్టర్

ప్రపంచంలో తల్లి ప్రేమకు సాటి ఏదీ లేదని అంటారు. తన బిడ్డకు ఆపద వస్తే తన ప్రాణాన్ని పణంగా పెట్టైనా పోరాడే తత్వం తల్లిది అన్న విషయాన్ని సూటిగా చూపించిన ఆంగ్ల చిత్రం 'కిడ్నాప్'. 2017లో లూయి ప్రీటో దర్శకత్వంలో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. హాలీవుడ్ ప్రముఖ కథానాయిక హేలీ బెర్రీ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ (ఇంగ్లిష్), లయన్స్ గేట్ (తెలుగు వెర్షన్) ఓటీటీల్లో స్ట్రీమ్ అవుతోంది. తల్లిగా ఆమె నటన ఈ సినిమా మొత్తానికే హైలైట్. కథాంశానికొస్తే... కార్లా డైసన్ ఓ సింగిల్ మదర్. తన ఆరేళ్ల కొడుకు ఫ్రాంకీని కార్నివాల్‌కు తీసుకువెళ్లడంతో 'కిడ్నాప్' సినిమా మొదలవుతుంది. కార్నివాల్‌లో అనుకోకుండా పార్కింగ్ లాట్ నుండి తన కొడుకును ఎవరో ఎత్తుకెళ్లడం చూస్తుంది కార్లా. ఇక అక్కడి నుండి ఆ కిడ్నాపర్ల వెంటపడి తన కొడుకును ఎలా కాపాడుకుంటుంది అన్నదే మిగతా కథ. ఈ సినిమా స్క్రీన్‌ప్లే దాదావు రోడ్డు మార్గాన్నే నడుస్తుంది. అమెరికా రోడ్లలో పరిమితికి మించి వేగంగా కొంతమంది కార్లు నడుపుతూ ఉంటారు. అంతకు మించి వేగంగా ఈ కథ స్క్రీన్‌ప్లే ఉంటుంది. కుర్చీలో కూర్చున్న ప్రేక్షకులు ఈ సినిమా మొదలయ్యాక శుభం కార్డు పడే వరకు లేవరు. సినిమాను అంత ఆసక్తికరంగా దర్శకుడు లూయి రూపొందించారనడంలో అతిశయోక్తి లేదు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీశారు. ప్రఖ్యాత సంస్థ అయిన ఎఫ్‌బీఐ ఇచ్చిన అంచనాల మేరకు అమెరికాలో ఏటా 8 లక్షలకు పైబడి ప్రతి 40 సెకన్లకు ఓ బిడ్డ కనిపించకుండాపోతున్న పరిస్థితి ఉంది. మనందరినీ మనకి తెలిసీ తెలియకుండా నిరంతరం కాపాడే అమ్మ ఆ విజయదుర్గ. ఆ తల్లి తత్వంతో తీసిన ఈ సినిమా నిజంగా అద్భుతం. విజయదశమి పండగ సమయంలో థ్రిల్లర్ జోనర్ ఇష్టపడే వాళ్లకి ఇదో మంచి చాయిస్.

– ఇంటూరు హరికృష్ణ